సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

బస్సు సర్వీస్ కోసం వినతి



ఆర్టీసీ ఆర్ఎంకు వినతిపత్రం అందజేస్తున్న సూరిబాబు

పెదగంట్యాడ: ఆర్టీసీ ద్వారకా కాంప్లెక్స్ నుంచి వికాస్‌నగర్ వరకు వచ్చే బస్సులను ప్రియదర్శినీ కాలనీ, సంజీవ కాలనీ, వాంబే కాలనీ, అశోక్‌నగర్, కొత్త దిబ్బపాలెం మీదుగా యాతపాలెం జంక్షన్ వరకు నడపాలని జీవీఎంసీ 50వ వార్డు బీసీ సెల్ అధ్యక్షుడు సంపంగి సూరిబాబు కోరారు. ఈ మేరకు ఆర్టీసీ విశాఖ రీజినల్ మేనేజర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని ఈ సర్వీసులను నడపాలని విన్నవించారు.

ఉక్కు సహాయ మంత్రి శ్రీనివాస వర్మకు అభినందనలు

ఉక్కునగరం: కేంద్ర క్యాబినెట్‌లో ఉక్కు సహాయమంత్రిగా నియమితులైన భూపతిరాజు శ్రీనివాసవర్మకు ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్, యు.రామస్వామి ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు. దక్షిణ భారతదేశంలో ఉన్న ఏకైక ప్రభుత్వ రంగ ఉక్కు పరిశ్రమ విశాఖ స్టీల్‌ప్లాంట్ అన్నారు. దక్షిణ భారతదేశానికి చెందిన శ్రీనివాస వర్మ ఉక్కు సహాయమంత్రిగా ఎంపిక కావడం ఆనందదాయకమని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ పూర్తి స్థాయి ఉత్పత్తికి అవసరమైన చర్యలను కొత్త మంత్రి చేపట్టాలని వారు కోరారు.

ముగిసిన 'శ్రీవిద్య' ప్రారంభ కోర్సు శిక్షణ



గురుమాత అన్నపూర్ణమ్మతో తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి పీఠంలో నిర్వహిస్తున్న శ్రీ విద్య ప్రారంభ కోర్సు సోమవారంతో ముగిసింది. నాలుగు రోజుల పాటు ఈ తరగతులను నిర్వహించారు. గురుమాత అన్నపూర్ణమ్మ శ్రీవిద్యా ఉపాసన పాఠ్యాంశాలు నేర్చుకున్న విద్యార్థులను ఆశీర్వదించి,జ్ఞాపికలు అందజేశారు. తెలుగు భాషలో నేర్చిన శ్రీ గురుమంత్ర దీక్ష,గణపతి చతురావృతి తర్పణ విధానం, ఆవరణార్చన,బాల తర్పణార్చన,చండీ నవార్ణవ మంత్రోపాసన సహిత దుర్గా సప్తశ్లోక పారాయణ విధి అనే అంశాలు విద్యార్థులకు నేర్పించారు. శిక్షణ తరగతులను శ్రీ విద్య ఉపాసకులు కందర్ప రమ, షణ్ముఖ నిర్వహించారని గురుమాత తెలిపారు.

ఘనంగా పైడిమాంబ తొలేళ్ల సంబరం



భక్తులు తీసుకొచ్చిన పైడిమాంబ ప్రతిమలు

సీతంపేట: సీతంపేట గ్రామదేవత పైడిమాంబ అమ్మవారి పండగలో భాగంగా సోమవారం తొలేళ్ల సంబరం ఘనంగా నిర్వహించారు. మొక్కులు తీర్చుకోవడానికి అమ్మవారి ప్రతిమలు(ఘటాలు) దొండపర్తి ఎరుకుమాంబ గుడి నుంచి భక్తులు తలపై పెట్టుకుని సీతంపేట రాధాకృష్ణ ఆలయం వరకు తీసుకువచ్చారు. అక్కడి నుంచి నాయుడు వీధిలోని అమ్మవారి సదరం పట్టుకు తీసుకెళ్లి రాత్రంతా పూజలు చేశారు.

నేడు ప్రధాన పండగ: అమ్మవారి ప్రధాన పండగ మహోత్సవం మంగళవారం కనుల పండువగా జరిపేందుకు శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ఏర్పాట్లు చేసింది. త్రిశక్తి ఆలయాన్ని చూడముచ్చటగా అలంకరించారు. మంగళవారం ఉదయం 5 గంటల నుంచి అమ్మవారిని భక్తులు దర్శించుకోవచ్చని ఉత్సవ కమిటీ చైర్మన్ ఇసరపు సురేష్‌బాబు తెలిపారు.



పరీక్ష ఏదైనా..ఇదిగో మెటీరియల్

- ఉద్యోగార్థులకు వరం గాజువాక శాఖా గ్రంథాలయం
- పుష్కలంగా పోటీ పరీక్షల పుస్తకాలు
- 'బుక్స్ ఆన్ డిమాండ్'కు విశేష ఆదరణ



గ్రంథాలయంలో పుస్తకాలు



పోటీపరీక్షల మెటీరియల్

గాజువాక: నిరుద్యోగ యువతకు గాజువాక శాఖా గ్రంథాలయం విజ్ఞానాన్ని అందించే కల్పతరువుగా మారింది. పోటీ పరీక్షలకు హాజరుకాగోరే అభ్యర్థులు, గ్రంథాలయ పాఠకులు కోరిన పుస్తకాలను సమకూర్చుతూ వారి ఉన్నతికి సహకారం అందిస్తోంది.

పాఠకులు కోరిన పుస్తకాల కొనుగోలు

పాఠకులు కోరిన పుస్తకాలను బుక్స్ ఆన్ డిమాండ్ పేరుతో ఏర్పాటు చేస్తూ వారి మన్ననలను అందుకుంటున్నారు. పోటీ పరీక్షలకు హాజరు కాగోరే అభ్యర్థులు, గ్రంథాలయ పాఠకులు తమకు కావాల్సిన పుస్తకాలను రిజిస్టర్‌లో నమోదు చేస్తే గ్రంథాలయాధికారులు వాటిని కొనుగోలు చేసి అందుబాటులో ఉంచుతున్నారు. ఫలితంగా గాజువాక ప్రాంత నిరుద్యోగులే కాక గాజువాక చుట్టుపక్కల మండలాలకు చెందిన నిరుద్యోగులు కూడా ఇక్కడికొచ్చి తమకు కావాల్సిన పుస్తకాలను తీసుకెళ్తున్నారు.

అందుబాటులో అన్ని పుస్తకాలు

గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలోని గాజువాక శాఖా గ్రంథాలయాన్ని పాఠకులు విశేషంగా ఆదరిస్తున్నారు. ప్రతీ రోజు 90 మందికి పైగా పాఠకులు వచ్చి వెళ్తుంటారు. ఇక్కడికి వచ్చే పాఠకుల్లో మహిళలే అధికంగా ఉంటున్నారని గ్రంథాలయాధికారి తెలిపారు. రోజుకు సగటున 20 పుస్తకాలు బయటకు వెళ్తుంటాయి. ఇవికాక, 7 దినపత్రికలు, 7 వార పత్రికలు, 12 మాస పత్రికలు అందుబాటులో ఉన్నాయి.

పోటీ పరీక్షలకు ప్రత్యేకం

పాఠకులకు పుస్తకాలను అందించడంలో ఈ గ్రంథాలయం ప్రత్యేకతను సంతరించుకుంది. పోటీ పరీక్షలకు హాజరుకాగోరు అభ్యర్థులకు ఇక్కడ విభిన్నమైన పుస్తకాలు లభిస్తాయి. ఏ సబ్జెక్టులోనైనా అభ్యర్థులు కోరిన పుస్తకాన్ని ఇక్కడి సిబ్బంది వెంటనే ఏర్పాటు చేస్తున్నారు. గ్రూప్–2 సహా వివిధ కాంపిటీటివ్ పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్ గ్రంథాలయంలో అందుబాటులో ఉంచారు. దీనికోసం ప్రతీ ఏడాది కొత్త పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా రూ.14,000 విలువైన కొత్త పుస్తకాలను సమకూర్చినట్టు గ్రంథాలయాధికారి తెలిపారు. డీఎస్సీ, టెట్, సివిల్ ఇంజినీరింగ్, పోలీస్ కానిస్టేబుల్, హైటెక్ విజయ రహస్యం, ఇండియన్ ఎకానమీ, ఎస్ఎస్‌సీ ఏపీ హిస్టరీ తదితర పుస్తకాలను ఇటీవలే అందుబాటులోకి తీసుకొచ్చారు.

అందుబాటులో 5,885 పుస్తకాలు

గ్రంథాలయంలో సభ్యుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ప్రస్తుతం 3020 మంది సభ్యులుగా ఉన్నారు. గడిచిన నెలరోజుల్లో కూడా 20 మందికి కొత్తగా సభ్యత్వాలను అందజేశారు. అన్నివర్గాల పాఠకులకు అవసరమైన పుస్తకాలు తమవద్ద అందుబాటులో ఉండటంతో పాఠకుల సంఖ్య పెరుగుతోందని గ్రంథాలయాధికారి తెలిపారు. ప్రస్తుతం గ్రంథాలయంలో 5,885 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వాటిలో తెలుగు, ఇంగ్లిష్, హిందీ, ఉర్దూతో పాటు ఇతర భాషల్లోనూ ఉన్నట్టు గ్రంథాలయాధికారి చెప్పారు.



గ్రంథాలయంలో పాఠకులు

పాఠకుల నుంచి అనూహ్య స్పందన



మా గ్రంథాలయంలో పాఠకులకు అవసరమైన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ వేల పుస్తకాలు వివిధ భాషల్లో ఉన్నాయి. నిరుద్యోగులకు కావాల్సిన అన్ని పుస్తకాలను మేము అందుబాటులో ఉంచుతాం. అందుకే అనూహ్య స్పందన లభిస్తోంది. ఎప్పటికప్పుడు కొత్త పుస్తకాలను కొనుగోలు చేస్తున్నాం. బుక్స్ ఆన్ డిమాండ్‌కు స్పందన బాగుంది.

–బి.చంద్రకళ, గ్రంథాలయాధికారి

బయోమెట్రిక్ సమస్యల పరిష్కారానికి విజ్ఞప్తి



స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిటూ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో బయోమెట్రిక్ వల్ల ఏర్పడిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ స్టీల్ సీఐటీయూ నాయకులు సీఎండీ అతుల్ భట్‌కు వినతిపత్రం అందజేశారు. బయోమెట్రిక్ అమలు ముందు జరిగిన సమావేశంలో గతంలో ఉన్న డార్స్ హాజరు పద్ధతిలా బయోమెట్రిక్ ఉంటుందని హామీ ఇచ్చినా, అప్పట్లో ఉన్న మెడికల్ పర్మిషన్, సీఆఫ్, వీక్లీ ఆఫ్ మార్పు, షిఫ్ట్ మార్పు తదితర సమస్యలు అపరిష్కృతంగా మిగిలి పోయాయన్నారు. బయోమెట్రిక్ అమలు ప్రారంభించి మూడు నెలలు కావస్తున్నా సమస్యలను పరిష్కరించకపోవడం సరికాదన్నారు. గత 27న జరిగిన సమావేశంలో మీరు ఇచ్చిన హామీ కూడా అమలు కాలేదన్నారు. ఆర్థికేతర అంశమైన బార్స్ కమిటీ ప్రతిపాదనలు అమలు చేయాలని కోరారు. సీఎండీని కలిసిన వారిలో యూనియన్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్, అధ్యక్షుడు వై.టి.దాస్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి తదితరులున్నారు.

వర్ధమాన గాయకులకు సత్కారం



గాయకులను అభినందిస్తున్న నిర్వాహకులు

మల్కాపురం: కరుణాంజలి మ్యూజికల్స్ ఆధ్వర్యంలో సినీ సంగీత దర్శకులు ఇళయరాజా జన్మదినాన్ని పురస్కరించుకుని వర్ధమాన గాయకులకు పాటల పోటీ నిర్వహించారు. స్థానికంగా జరిగిన ఈ పాటీల్లో హైదరాబాద్,అరకు,విజయవాడ,విశాఖ,అనకాపల్లి తదితర ప్రాంతాల నుంచి సుమారు వంద మంది వర్ధమాన గాయనీగాయకులు పాల్గొని ఇళయరాజా చిత్రాలకు సంబంధించిన పలు పాటలతో ఆహూతులను అలరించారు. అనంతరం తమ గీతాలతో ద్వారా ప్రేక్షకులను ఉర్రూతలు ఊగించిన గాయనీ గాయకులను నిర్వాహకులు అభినందించారు.



నీలాకాశంలో శ్వేతపుష్పాల్లా..

ప్రకృతి అందాలు అద్భుతం. మనసుకు ఉల్లాసాన్ని కలిగించే ఆ సౌందర్యం ప్రకృతి ఆరాధకులకు నేత్రపర్వం. నడుపూరు ప్రధాన రహదారిలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద కనిపించిన రమణీయ దృశ్యమే ఇందుకు నిదర్శనం. సాయం సమయంలో నీలి ఆకాశంలో తేలియాడుతున్న మబ్బులు శ్వేతపుష్పాలను తలపించగా.. ఆ దృశ్యం చక్కని చిత్రకారుడు కాన్వాస్‌పై చిత్రించిన పెయింటింగ్‌లా అనిపించింది. ఆకాశంలో ఆవిష్కృతమైన ఈ మనోహర దృశ్యం చూపరులను ఆకట్టుకుంది. – పెదగంట్యాడ


ప్రజా రవాణా వినియోగంతో కాలుష్య నియంత్రణ



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీకి చేరుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: వారంలో ఒక్క రోజైనా ప్రజా రవాణా వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ఆమె తమ క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీ ప్రధాన కారాలయానికి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒక రోజు ప్రజా రవాణాను వినియోగించాలని గతంలో నిర్ణయించామన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒకరోజు ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించాలని కోరారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జితసేవలు



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యావవాచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టంపజేసి అష్టోత్తరంపూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

15 నుంచి కన్యకా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవాలు



వార్షికోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి పంచాయతన దేవాలయం ద్వితీయ వార్షికోత్సవాన్ని ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు మొగలపల్లి త్రిమూర్తులు, కొల్లా అప్పలరాజు, ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి తెలిపారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు సోమవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ముక్కామల వాసవీమాత ఆత్మాహుతి స్థాన మహా పీఠాధీశుడు, విద్యా మహామంత్ర సిద్ధుడు శ్రీధర స్వామీజీ పర్యవేక్షణలో అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు, యాగాలు తదితర పూజా కార్యక్రమాలు చేయనున్నామని వివరించారు. ఇందులో భాగంగా ఈ నెల 17న సోమవారం మధ్యాహ్నం అన్న సమారాధన ఉంటుందన్నారు. కార్యక్రమంలో కులుకూరి మంగరాజు, కేసారపు శ్రీను రమేష్, కేసారపు సతీష్, నంబూరి జగన్నాథం, కట్టా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పవర్ లిఫ్టింగ్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అండిబోయిన లక్ష్మి తదితరులు

పెదగంట్యాడ: ఏపీ స్టేట్ పవర్ లిఫ్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అండిబోయిన అప్పారావు, కార్యదర్శి మర్ల భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీలు ముగిశాయి. మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని సీడబ్ల్యూసీలో ఈ నెల 8, 9 తేదీల్లో థర్డ్ ఏపీ స్టేట్ డెడ్లిఫ్ట్ చాంపియన్ షిప్–2024, ఫోర్త్ ఏపీ స్టేట్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్–2024, సిక్త్ ఏపీ స్టేట్ బ్రెంచ్ ప్రెస్ చాంపియన్ షిప్–2024 పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. సబ్ జూనియర్స్, సీనియర్స్, మాస్టర్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జీవీవీ సత్యనారాయణ, రమేష్ యాదవ్ విజేతలుగా నిలిచారు. విజేతలకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లను రాష్ట్ర యాత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అండిబోయిన లక్ష్మి, శ్రీలత, ఏఎస్ఐ అనూరాధ అందజేశారు. కార్యక్రమంలో గుత్తల రాంబాబు, సత్యారావు, అప్పారావు, రంజాన్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



స్టీల్‌ప్లాంట్ సీజీఎం సోఫ్టీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ అనుబంధ విశాఖ స్టీల్ ప్రాజెక్ట్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద సోమవారం ధర్నా చేశారు. బయోమెట్రిక్ విధానం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున పాత పద్ధతిని కొనసాగించాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఆరు నెలలుగా సకాలంలో జీతాలు చెల్లించటం లేదని, ప్రతీ నెలా 7వ తేదీలోగా వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్కిల్డ్, సెమీ స్కిల్డ్ కార్మికులకు ఈఎస్ఐ లేకపోవటం వల్ల కార్మికులు నష్టపోతున్నారని, వారికి మెడికల్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని అన్నారు. బ్లాక్‌లిస్ట్ అయిన కాంట్రాక్టర్ల వద్ద పని చేస్తున్న కార్మికుల ఫుల్ అండ్ ఫైనల్ యాజమాన్యం చెల్లించాలన్నారు. టెంపరరీ పేరుతో జరుగుతున్న కాంట్రాక్టుల్లో పనిచేస్తున్న కార్మికులకు ఎస్.ఎం.ఎ, ఎ.ఎస్.ఎం.ఎ వర్తింప చేయాలన్నారు. అందరు కాంట్రాక్టర్లు పీఎఫ్, ఈఎస్ఐ విధిగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సీజీఎం (వర్క్స్) ఎ.కె. సోఫ్టీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో స్టీల్ ఏఐటీయూసీ అధ్యక్షుడు కె.ఎస్.ఎన్.రావు, కాంట్రాక్ట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రవి, అధ్యక్షుడు నందికి తాతా రావు, కోశాధికారి సిహెచ్.నాగరాజు, ఎల్.సోంబాబు, పి.మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

హామీలను ప్రధాని నిలబెట్టుకోవాలి



దీక్ష శిబిరంలో పాల్గొన్న నాయకులు

అగనంపూడి: తిరుపతి ఎన్నికల ప్రచార సభలో ఇచ్చిన హామీలను ప్రధానమంత్రి మోదీ నిలబెట్టుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు కోరారు. ఆ దిశగా సంకీర్ణ ప్రభుత్వంలో ఉన్న టీడీపీ, జనసేన పార్టీల అధినేతలు ప్రధానిపై ఒత్తిడి తేవాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే దీక్షల్లో 1215వ రోజు, సోమవారం వారు పాల్గొని మాట్లాడారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించడం, విశాఖ రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం, వెనుకబడిన జిల్లాల అభివృద్ధిపై ప్రకటన చేయాలన్నారు. విభజన చట్టంలోని హామీలను వెంటనే అమలు చేయాలని వారు కోరారు. శిబిరంలో సింటర్ ప్లాంట్ కార్మికులతో పాటు నాయకులు ఎం.రామారావు, ఎన్.రామచంద్రరావు, నరేంద్ర, శ్రీనివాస్ నాయుడు, జగదీష్, సత్యనారాయణ, కామేశ్వరరావు, రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాంగ్ పార్కింగ్‌పై ఉక్కు పాదం

- ఫుట్‌పాత్ ఆక్రమణలపై చర్యలు
- కొరడా ఝుళిపిస్తున్న ట్రాఫిక్ పోలీసులు



రహదారికి అడ్డంగా నిలిపిన కారుకు తాళం వేసిన ట్రాఫిక్ పోలీసులు



గోపాలపట్నం ప్రధాన రహదారిలో నిలిపిన వాహనాలు

గోపాలపట్నం: రహదారులపై అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపే వారిపై గోపాలపట్నం ట్రాఫిక్ అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. నగరంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే విధంగా వాహనాలు నిలపడంపై పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి సారించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగారు. అడ్డదిడ్డంగా వాహనాలు నిలుపుతున్న వారి ఆటకట్టిస్తున్నారు. తొలుత రాంగ్ పార్కింగ్‌పై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఆ తర్వాత నుంచి వీల్ లాకింగ్ చేసి అపరాధ రుసుము విధిస్తున్నారు. ఇప్పటికే పలు మార్లు గోపాలపట్నం నుంచి ఎన్ఏడీ వరకు ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టారు. వాహనాలు నిలపరాదంటూ హెచ్చరికలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిలిపిన వాహనం చక్రాలకు లాక్ వేసి ఆన్‌లైన్ చలానా ద్వారా ఫైన్ వేస్తున్నారు.

సెల్లార్లపై వాడకంపై చర్యలకు డిమాండ్

గోపాలపట్నం, బాజీ జంక్షన్, ఎన్ఏడీ ప్రాంతాల్లో ఉన్న భారీ షాపింగ్ మాల్స్‌లో సెల్లార్లను వ్యాపారాలు లావాదేవీలకు వాడుకుంటున్నారు. వీరిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ సెల్లార్లలో వాహనాల పార్కింగ్ చేసేందుకు అనుమతి ఇవ్వకపోవడంతో కొనుగోలు దారులు రోడ్డుపైనే వాహనాలు నిలిపేస్తున్నారు. ఈ వాహనాలు రోడ్డు మార్జిన్ దాటి సగం వరకు ఆక్రమించేస్తుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీనిపై ట్రాఫిక్ అధికారులు, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టాలని వాహనాదారులు కోరుతున్నారు.

ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల పరిరక్షణ



ఇంకుడు గుంతలను నిర్మిస్తున్న అసోసియేషన్ సభ్యులు

సింధియా: ఏపీ ఫెడరేషన్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు మేరకు వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏఎస్‌సీ, ఏకేసీకాలనీలో రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేశారు. అసోసియేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఉదయ్, ఉపాధ్యక్షులు డాక్టర్ కె.ఎస్.ఆర్ మూర్తి, ప్రధానకార్యదర్శి దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో శరవేగంగా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో జోన్ 5 కోఆర్డినేటర్ కర్రి శేషగిరి మాట్లాడుతూ ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. శ్రీ నూకాంబిక వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండపు నాగేశ్వరరావు జీవీఎంసీ కార్పొరేటర్‌గా ఉండడంతో ఈ ప్రాంతంలో కార్యక్రమం విజయవంతంగా సాగుతోందన్నారు. కార్పొరేటర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ భవిష్యత్తులో నీటి సమస్య రాకుండా ఉండాలని ముందుగానే రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా రాష్ట్రం అంతటా ఇంకుడు గుంతలను నిర్మించడం గొప్ప విషయమన్నారు.

